క్లుప్తంగా

ఎమ్మెల్యే వెలంపల్లికి కృతజ్ఞతలు తెలిపిన పైడిపాటి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ సిటీ కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పైడిపాటి వెంకటేశ్వరరావు సోమవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని అన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి కృషి చేయాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్ట శేషు నారాయణరావు, లంకా బాబు తదితరులు పాల్గొని వెంకటేశ్వరరావును అభినందించారు.

సింగ్‌నగర్‌లో ఫ్లాగ్ మార్చ్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా కేంద్ర పారా మిలటరీ బలగాలు సోమవారం సింగ్‌నగర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సంఘ విద్రోహ శక్తులను నిర్మూలించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నేరప్రవృత్తి కలిగిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నారు. సింగ్‌నగర్ ఎంబీ స్టేడియం, లూనాసెంటర్, లెనిన్‌సెంటర్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. డీసీపీ హరికృష్ణ, నార్త్ జోన్ ఏసీపీ డీవీఎస్ఎన్ ప్రసాద్, అజిత్‌సింగ్ నగర్, సత్యనారాయణపురం, నున్న సీఐలు జి.గురుప్రకాష్, వెంకటనారాయణ, ఎస్. దుర్గాప్రసాద్, ఆయా స్టేషన్ల ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సహస్ర లింగార్చన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస భజన బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈఓ గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

మారిన 27వ డివిజన్ రూపురేఖలు

- రూ. 3.20 కోట్లతో నాడు–నేడు పనులు
- ఆహ్లాదకరంగా ఉద్యాన వనాలు, ఓపెన్ జిమ్‌లు
- సకల సౌకర్యాలతో ఆరోగ్య కేంద్రం

నాడు



నేడు



గులాబీతోట జంగా అప్పారావు వీధి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో 27వ డివిజన్ రూపురేఖలు మారిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో సమస్యల వలయంలో ఉన్న 27వ డివిజన్ నేడు సుందర ఉద్యానవనాలు, శారీరక ధారుఢ్యం, ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్‌లు, సకల వసతులతో పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు కోట్లాది రూపాయలతో రోడ్లను అందంగా తీర్చిదిద్దారు.

తీరిన చిరకాల వాంఛ..

27వ డివిజన్‌లో అధికంగా నివసించే రజకులు శుభకార్యాలు చేసుకునేందుకుగానూ సామాజిక భవనం నిర్మించాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం రజకుల కల్యాణ మండపం పేరిట మోసం చేసింది. దీంతో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు రూ. 75.85 లక్షలతో అన్ని వసతులతో చిట్యాల ఐలమ్మ సామాజిక భవన్ పేరిట భవనం నిర్మించి ప్రారంభించారు. అలాగే ఏడీసీ ఉద్యానవనంలో కాపు కల్యాణ మండపం పేరిట గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా మోసం చేయగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రూ. 7.62 లక్షలతో ఓపెన్ డయాస్‌ను నిర్మించి నిరుపేదలు శుభకార్యాలను ఉచితంగా చేసుకునేలా సిద్ధం చేశారు.

రహదారులకు మహర్దశ..

నిత్యం రద్దీగా ఉండే సాంబమూర్తిరోడ్డును రూ. కోటి వ్యయంతో మరమ్మతులు చేయడంతో పాటు డివిజన్‌లోని రోడ్లను సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా పేవర్‌ను ఏర్పాటు చేసి రాకపోకలకు అనువుగా తయారు చేశారు. నాలుగు వార్డు సచివాలయాల పరిధిలో మంజూరైన రూ. 80 లక్షల 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో జంగా అప్పారావువీధి, ఘంటసాల సంగీత కళాశాల రోడ్డు(చామర్తివారివీధి) సహా పలు వీధుల్లో రోడ్లు నిర్మించారు. అలాగే పున్నయ్యకాలనీలో రూ. 4.14 లక్షలతో సీసీ రోడ్డు వేశారు.



చిట్యాల ఐలమ్మ సామాజిక భవన్

మెరుగైన వైద్యసేవలు..

ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తోన్న స్థానిక డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని రూ. 10 లక్షలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని రూ. 7 లక్షలతో మరమ్మతులు చేశారు. అదేవిధంగా రూ. 39 లక్షలతో కుర్మయ్య బ్రిడ్జి నుంచి కొత్త వంతెన వరకు రైవస్ కాలువ పరిసరాలను ఫెన్సింగ్‌తో పరిరక్షించారు. అలాగే డివిజన్‌లోని ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో నాడు–నేడు కింద రూ. 3.20 కోట్లతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి.

పార్కుల సుందరీకరణ..

ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం అందించేలా ఈ ప్రాంతంలో పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరిగింది. రూ. 12.70 లక్షలతో దుర్గాపురం పార్కు, రూ. 7.90 లక్షలతో గులాబీ తోటలోని సమ్మెట రామస్వామి పార్కులను అభివృద్ధి చేశారు. అలాగే దుర్గాపురం వాకర్స్ క్లబ్ నందు రూ. 12.70 లక్షలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయగా.. గులాబీ తోటలోని ఏడీసీ పార్కులో రూ. 30 లక్షలతో వాకింగ్ ట్రాక్, ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

27వ డివిజన్‌లో నవరత్నాలు పథకాల ద్వారా డీబీటీ విధానంలో 10,047 మందికి రూ. 29,42,2,047 నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా 1,932 మందికి రూ. ఎనిమిది కోట్ల లబ్ధి చేకూరింది.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు



ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేశాం. దశాబ్దాల కలగా ఉన్న రజకుల సామాజిక భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ పాలన సాగుతోంది.

– కొండాయగుంట మల్లీశ్వరి, కార్పొరేటర్

పారదర్శక పాలన సాగిస్తున్నాం



కులమత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పారదర్శక పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చేయడం జరిగింది. డివిజన్ వాసుల చిరకాల వాంఛలను నెరవేర్చినందుకు ఆనందంగా ఉంది. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి పెట్టాం.

– మల్లాది విష్ణు, ఎమ్మెల్యే

ఫాల్గుణ పూర్ణిమ విశిష్టతపై ప్రచారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫాల్గుణ మాసంలో వచ్చే ఫాల్గుణ పూర్ణిమ(హోలీ) విశిష్టతపై సోమవారం త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు మధురానగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు జగిరపు సురేష్ హోలీ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో శంకర్, అప్పలనరసమ్మ, దుర్గారావు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

నవ వధువుకు అత్తింటి వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నవ వధువుకు అత్తింటి వేధింపుల ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. లంబాడీపేట తోట లక్ష్మయ్య వీధికి చెందిన భావనకు ఆరు నెలల కిందట ఖమ్మం జిల్లాకు చెందిన దుంగ్రోత్ మోహన్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నం, ఇతర లాంఛనాలు భారీగానే ఇచ్చారు. పెళ్లయి కాపురానికి వెళ్లినప్పటి నుంచి మోహన్ భార్య భావనను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు అత్త, ఆడపడుచులకు చెప్పింది. నీవు తెచ్చిన కట్నం సరిపోలేదని చెప్పి భర్తతో పాటు అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన వారు రానున్న ఎన్నికల్లో అధికారం పొందడమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మద్దాల అగస్టీన్‌ను సోమవారం తమ కార్యాలయంలో సత్కరించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే అగస్టీన్, మరింత ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య (వర), బచ్చు మురళీ, ప్రభుదాస్, తుళ్లూరి ఉదయ్, సాంగా రాజ్‌కమల్, ఉమ్మడి ధనరాజ్, జగ్జీవన్‌రావు, బి.ప్రకాష్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ వైపే ప్రజలు

సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



32వ డివిజన్‌లో ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపు ఉన్నారని సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 32వ డివిజన్ అయోధ్య నగర్‌లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కో–ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణితో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. దారి పొడవునా మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ వైఎస్సార్ సీపీకి అండగా ఉంటామని ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి జగనన్నను గెలిపించుకుంటామని అన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ తాము చేసిన మంచిని చూసి నచ్చితేనే ఓట్లు వేయ మని అడిగిన ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందని వారు అంటూ ఎవరూ లేరంటే అతిశయోక్తి కాదని అన్నారు. జగనన్నను మరోమారు సీఎం చేయాలని ప్రజలంతా పరితపిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ హయాంలో 32వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దామని పేర్కొన్నారు.

చిలకలూరిపేట సభ అట్టర్ ఫ్లాప్..

టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి నిర్వహించిన చిలకలూరిపేట సభ అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. వీళ్లందరికీ సమాధానం చెప్పేందుకు సిద్ధం సభ ఒకటి చాలని అన్నారు. ప్రజల మనస్సుల్లో సీఎం జగన్ చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్నారని.. ఎంత మంది కలిసి వచ్చినా జగనన్నను ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో ఉండగా అందిన కాడికి దండుకోవడం కబ్జాలతోనే పాలన సాగించిన బోండా ఉమా ప్రజలకు ఏం చేశారో చెప్పాలని వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో కనీసం ప్రజలకు ఒక ఇంటి పట్టాను అందించారా అని ప్రశ్నించారు. బోండాకు ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత లేదని అన్నారు. ప్రజల విశ్వసనీయత కోల్పోయిన టీడీపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎన్నికల్లో మంచిని గెలిపించాలని, భూకబ్జాలు, సంఘ విద్రోహ శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో కనీసం ప్రజలు ఎలా ఉన్నారో కూడా బోండా పట్టించుకోలేదని ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండే సుందర్‌పాల్, ఒగ్గు గవాస్కర్, ఎంఎస్ఆర్, పేరం త్రివేణిరెడ్డి, డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా సేవలు అందించాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు):లయన్స్ క్లబ్ సేవలను గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించాలని జిల్లా గవర్నర్ జెఎస్ శంకరగుప్తా అన్నారు. విజయవాడలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శంకర గుప్తా మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌లోకి మహిళలనూ భాగస్వాములుగా చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి క్లబ్‌కు సంబంధించి నెలవారీ సమావేశాలు నిర్వహించి తద్వారా గ్రామాల్లో ప్రజలకు సేవలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మాజీ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శ్రీకాంతి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరి, లయన్స్ క్లబ్ ముఖ్య సలహాదారులు కత్తిక శివనాగేశ్వరరావు, అన్నె శివనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'బోండా'కు గుణపాఠం చెబుతాం

క్షత్రియ నాయకులు



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు సంఘీభావం తెలుపుతున్న క్షత్రియ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అధికారంలో ఉన్నన్ని రోజులు క్షత్రియులను అవమానించి, అక్రమ కేసులను బనాయించి వేధింపులకు గురిచేసిన టీడీపీ నాయకుడు బోండా ఉమాకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని క్షత్రియ నాయకుడు పెనుమత్స సత్యనారాయణరాజు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని సెంట్రల్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో క్షత్రియ పెద్దలు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో క్షత్రియులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యంగా సెంట్రల్ నియోజకవర్గంలో క్షత్రియులపై బొండా ఉమా అనేక వేధింపులకు పాల్పడ్డాడని గుర్తుచేశారు. చంద్రబాబు పిఠాపురం సీటు ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణవర్మను మోసం చేస్తే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా ఐదుగురు క్షత్రియులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం జగనన్న ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి క్షత్రియుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేయడంతో క్షత్రియులంతా ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ వెంటే నడిచేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గూండాయిజం, రౌడీయిజంతో కబ్జాలకు పాల్పడే బొండా ఉమాను నియోజకవర్గంలో తిరగనీయకుండా చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్‌కు తిరుగులేని మెజార్టీని అందించడంలో క్షత్రియులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష మాట్లాడుతూ టీడీపీ నాయకులకు క్షత్రియులంటే చులకనభావం ఉందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు క్షత్రియుల భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బొండా ఉమా క్షత్రియులపై అన్యాయంగా, అక్రమంగా కేసులు బనాయించి వేధింపులకు గురిచేసి ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి కపట ప్రేమతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉమా మోసపూరిత మాటలను క్షత్రియులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మరని, క్షత్రియుల అభివృద్ధికి తోడ్పడిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. గోవిందరాజులు (చిన్నా), లఖంరాజు సునీత మాట్లాడుతూ క్షత్రియులకు మంత్రి పదవులు, గుర్తింపును ఇచ్చింది వైఎస్సార్ సీపీనేనన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపులో క్షత్రియులంతా కీలకపాత్రను పోషిస్తామని ప్రకటించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును కలిసి తమ మద్దతు తెలియజేశారు. సమావేశంలో క్షత్రియ నాయకులు చంద్రశేఖర్ రాజు, శివరామరాజు, వెంకటేశ్వర రాజు, వీవీ వర్మ, సత్యనారాయణరాజు, ఆంజనేయులురాజు, రంగరాజు, కృష్ణంరాజు, లక్ష్మి, రాజ్యలక్ష్మి, రామభద్రరాజు, మురళి కృష్ణంరాజు పాల్గొన్నారు.









సుందరవనం.. సింగ్‌నగర్ డంపింగ్‌యార్డు



ఒకప్పుడు చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలతో అత్యంత అపరిశుభ్రంగా ఉండే సింగ్‌నగర్ డంపింగ్ యార్డు నేడు అత్యంత సుందరవనంగా మారింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. అందరికీ అవగాహన కలిగించే విధంగా వివిధ అంశాలపై చిత్రాల రూపంలో ప్రదర్శన ఏర్పాటుచేశారు. అద్భుతమైన మొక్కలు నాటి చుట్టూ గ్రీనరీ రూపుదిద్దారు. విజ్ఞాన వీచికగా మారిన డంపింగ్ యార్డు ఆకర్షణీయంగా ఉంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వైవీ రావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటం అవసరమని, అప్పుడే సమస్యల నుంచి దూరంగా ఉంటారని వైవీ రావు అసోసియేట్స్ అధినేత వైవీ రావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన వైవీ రావు మాట్లాడుతూ వినియోగదారుల చట్టం ప్రజలకు అనేక అంశాల్లో రక్షణ కల్పిస్తుందని తెలిపారు. దుకాణదారుల నుంచి మోసపోకుండా, నష్టపోకుండా అనేక చట్టాలు అండగా నిలుస్తాయన్నారు. వస్తు, సేవల కొనుగోలు క్రమంలో ఎదురయ్యే నష్టం లేదా ఇతర సమస్యల నుంచి వినియోగదారులకు అండగా ఉండేందుకు ఈ చట్టాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. అయితే వాటిపై విద్యార్థులకు ఇతర ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని క్లబ్ కన్వీనర్ విజయబాబు టెక్కెం నిర్వహించగా కామర్స్ అండ్ మేనేజిమెంట్ విభాగాధిపతి ఎన్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లిలో సోమవారం విజయవాడకు చెందిన మ్యాక్సివిజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక బెస్ట్ మార్ట్ ఆన్‌లైన్ సర్వీసెస్ సంస్థ ప్రాంగణంలో 110 మందికి కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 17 మందిని ఆపరేషన్లకు సిఫారసు చేసినట్లు క్యాంపు కో–ఆర్డినేటర్ ఎ.మునేశ్వర్ తెలిపారు.